స్వగృహయోగం.. అమోఘం



జలదంకి మండలం జమ్మలపాళెంలో శరవేగంగా సాగుతున్న ఇళ్లు



➡ పేదోడి స్వగృహం స్వప్నం దశాబ్దాలుగా మిగిలిపోయింది. గత ప్రభుత్వాలు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చినా ఊరికి దూరంగా అర కొర మందికే ఇచ్చేవి. అవి సైతం నివాసం యోగ్యతకు నోచుకోని విధంగా ఉండేవి. వాటిని బాగు చేసుకునే.. ఇల్లు కట్టుకునే స్థోమత లేక అలానే వదిలేసిన పరిస్థితి. ఎలాంటి వసతుల కల్పన లేకపోవడంతో ఏడారి వంటి ప్రాంతాల్లో ఇల్లుకట్టుకునేందుకు ఎవరూ ముందుకు రాని దుస్థితి.

➡ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. పేదోడికి ఇంటి స్థలం ఇవ్వడమే కాదు.. ఇల్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. పేదలకు ఇచ్చిన స్థలాలను ప్రైవేట్ లేవుట్లను తలదన్నేలా జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వసతి, విద్యుత్ లైన్లు ఇలా.. సకల మౌలిక సౌకర్యాలు కల్పించింది. లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన ఇసుకను ఉచితంగా, తక్కువ ధరకే సిమెంట్, స్టీల్, అందుబాటులో ఇటుకలు ఏర్పాటు చేస్తోంది. దీంతో జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

నియోజకవర్గంలో 194 లేఅవుట్లు
- 6,406 మందికి ఇళ్లు మంజూరు
- జగనన్న కాలనీల్లో శరవేగంగా నిర్మాణాలు
- మరో వైపు మౌలిక వసతుల కల్పన

ఉదయగిరి: ఎనిమిది మండలాల విశాలమైన మెట్ట ప్రాంతం.. ఉదయగిరి నియోజకవర్గం. ఆయా మండలాల్లో పేదల సొంతింటి స్వప్నాన్ని సాకారం చేసేందుకు 194 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసింది. తొలి దశలో 6406 మందికి ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తోంది. తక్కువ ధరకే సిమెంట్, స్టీల్, ఇటుకలను సరఫరా చేస్తోంది. మరో వైపు కలెక్టర్ నుంచి పట్టణాల్లో కమిషనర్లు, మండలాల్లో తహసీల్దార్ల వరకు టార్గెట్లు పెట్టుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తోంది. మరో వైపు గృహ నిర్మాణశాఖ నిరంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తున్నారు.

శరవేగంగా..

ప్రభుత్వం అందరికీ ఇల్లు అనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పేదలకు ఇచ్చే స్థలాలను ఎంపిక చేసి ప్రైవేట్ లేఅవుట్ల కంటే మిన్నగా సిద్ధం చేసింది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా ముందుగానే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించింది. దీంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో పాటు ఇతర సౌకర్యాలతో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి మొగ్గు చూపడంతో శరవేగంగా జరుగుతున్నాయి. ఇంకా ప్రారంభించని లబ్ధిదారులతో అధికారులు సమావేశం అయి అవగాహన కల్పిస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లింపులు, సామగ్రి అందుబాటులోకి రావడంతో పనులు వేగం పుంజుకుంటున్నాయి. ఫలితంగా అనేక గ్రామాల్లో నూతన కాలనీలు పురుడు పోసుకుంటున్నాయి. గ్రామాల్లో అనువైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు గుర్తించి నూతన లే అవుట్లు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలం లేనిచోట్ల ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుతున్నారు. వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో మాత్రమే ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసి రెండు లే అవుట్లు వేశారు. ఈ లే అవుట్లలో అర్హులైన పేదలను గుర్తించి మహిళల పేర్లు మీద పట్టాలు మంజూరు చేశారు. సామూహిక అవసరాల కోసం కొంత మేర స్థలం వదలి పెట్టారు. మొదటి ఫేజ్‌లో జలదంకి మండలం జమ్మలపాళెంలో మాత్రమే గృహనిర్మాణాలు పూర్తి చేశారు. దాదాపు అన్నీ ఇళ్లు తుది దశకు చేరువలో ఉన్నాయి.

ఉదయగిరి నియోజకవర్గంలో మంజూరైన ఇళ్లు

మండలం	లే అవుట్లు	మంజూరైన ఇళ్లు
వరికుంటపాడు	35	1,175
జలదంకి	26	888
కొండాపురం	20	366
దుత్తలూరు	28	647
కలిగిరి	38	1,037
వింజమూరు	19	1,340
ఉదయగిరి	28	953

సొంతింటి కల నెరవేరింది



జగనన్న మాకు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకనేందుకు రూ.1.80 లక్షలు ఇచ్చారు. మేము సొంతగా ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేదు. ప్రభుత్వం చేసిన సహాయంతోనే సొంతంగా ఇళ్లు కట్టుకుని ఇంట్లో చేరాం. సీఎం జగనన్న సహాయాన్ని ఎప్పుటికి మర్చిపోలేం. సొంతంటి కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది.

– టి. శిరీష, జమ్మలపాళెం

ఆనందంగా ఉంది



ప్రభుత్వం స్థలమిచ్చింది. ఇల్లు మంజూరు చేసి కట్టించింది. దీంతో నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేను సొంతంగా ఇళ్లు కట్టుకునే స్థోమత లేదు. సీఎం జగనన్న పుణ్యమా అని మాకు స్థలంతో పాటు ఇళ్లు కూడా సమకూరింది. పైగా పైసా ఖర్చు లేకుండానే అన్నీ వసతులు ప్రభుత్వం కల్పిస్తోంది.

– మమత, జమ్మలపాళెం

వేగంగా మౌలిక సదుపాయాలు



జగనన్న లేఅవుట్లలో చాలా వరకు మౌలిక సదుపాయాలు త్వరగా ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా బోర్లు వేస్తున్నాం. విద్యుత్ సదుపాయం కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తోంది. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు కూడా వారి ఖాతాల్లో పడుతున్నాయి. పాడుపు సభ్యులకు అదనంగా మరో రూ.35 వేలు అందిస్తున్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుండగా, సిమెంట్, స్టీల్, ఇసుక రూపంలో మరో రూ.40 వేల వరకు ఖర్చు తగ్గుతోంది.

– రామకృష్ణ, డీఈ, హౌసింగ్, ఉదయగిరి

క్లుప్తంగా

నేడు కాటేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి (వింజమూరు): మండలంలోని కాటేపల్లి సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కాటేపల్లి మెయిన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి కాటేపల్లి బీసీకాలనీలో జరిగే కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పాల్గొంటారని తెలిపారు. కావున అందరూ అధికారులు హాజరు కావాలని కోరారు.

భగవద్గీత పోటీలపై అవగాహన

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో త్వరలో నిర్వహించనున్న మండల స్థాయి భగవద్గీత పోటీలపై శుక్రవారం మండలంలోని వెన్నవాడ ఎంపీపీ పాఠశాలలో గీతాజ్ఞానయజ్ఞ సమితి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భగవద్గీత అవగాహన చేసుకోవడంతో పాటు ఆచరించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థితి సాధించవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వెలిశెట్టి నారాయణరావు, రామయ్యస్వామి, వన్నం వెంకటేశ్వర్లు, గార్లపాటి సురేష్ బాబు, కలిశెట్టి రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

వీఏఏను సస్పెండ్ చేయాలి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక ఆర్బీకేలో రైతుల పంట నష్టపరిహారంలో అవకతవకలకు పాల్పడిన వీఏఏ ప్రత్యూషను అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. అర్హులైన రైతులకు న్యాయం చేయడంతో పాటు అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మార్లెళ్ల బ్రహ్మారెడ్డి, బీజేపీ నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న డెయిరీ ప్రతినిధులు

సంగం: పొదలకూరు మండలం మహ్మదాపురంలో హాస్టల్ పురాతన భవనాన్ని కూల్చేస్తున్న సమయంలో ప్రమాదవాశత్తు శ్లాబు పెచ్చులు మీద పడి మరణించిన సంగంకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని దొడ్ల డెయిరీ యాజమాన్యం ఆదుకుంది. శుక్రవారం దొడ్ల డెయిరీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



జెడ్పీ హైస్కూల్‌కు బీరువా అందించిన బ్యాంక్ అధికారులు

కలిగిరి: కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా 'ఫౌండేషన్ డే' సందర్భంగా బీరువాను శుక్రవారం అందజేశారు. బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భీమేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ చెంచయ్య, అసిస్టెంట్ మేనేజర్ హాజీఫీర్, సిబ్బంది భాస్కర్, ప్రతాప్, వంశీ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.గిరిబాబుకు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు. శుక్రవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. సీఐ గిరిబాబు ఇటీవల ఎస్పీ ఆదేశాల మేరకు విశాఖపట్నంలో ఉన్న గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకుని తన ప్రతిభను కనపబరిచారు. దీంతో ఎస్పీ ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐకి సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జగనన్న విజయాన్ని అడ్డుకోలేరు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: ప్రజల దీవెనలు నిండుగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని వచ్చే ఎన్నికల్లో ఎవరూ అడ్డుకోలేరని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పురిణిలో ఎమ్మెల్యే శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకుడు తాండ్ర మల్లికార్జున ఆధ్వర్యంలో మోపూర్ నుంచి తుపాన్‌నగర్ వరకు 200 బైక్‌లతో భారీ ర్యాలీగా ఎమ్మెల్యేను తమ గ్రామానికి స్వాగతించారు. ర్యాలీలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా బైక్ నడిపి అందరిని ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు లభించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సచివాలయాల, రైతుభరోసా కేంద్రాలు వంటివి ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో 98 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, సర్పంచ్ మైనంపాటి స్వాతి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, బీద రమేష్, ఉస్మాన్, సాధిక్ రెడ్డి, తాండ్ర రాజ, దాసరి మల్లి, దాసరి శ్రీహరి, నిమ్మల భాస్కర్, మనోహర్, సుధ, రసూల్, శీనయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి చేనేతల పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కుటుంబాలు

సంగం: వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత ఆర్థిక సాయం నిధులు విడుదల చేసి వారిని మరింతగా ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి చేనేతలు సంగంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత కంతాబత్తిన రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అందరి సంక్షేమంపై దృష్టి సారించారన్నారు. ప్రతి ఏటా చేనేతలను ఆదుకునేందుకు వారి ఖాతాల్లో రూ.24 వేల వంతున ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు జమ చేశారని వివరించారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని, అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టెం వేణు, సుకమంచి భాస్కర్, దశయ్య, ఓబులేసు, బుజ్జయ్య, రత్నం, సిద్ధయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కరుణాకర్, శివ, రవి, జనార్దన్, జహంగీర్, చిరువెళ్ల వేణు, వెంగయ్య పాల్గొన్నారు.

హజ్ యాత్రకు సీఎం వైఎస్ జగన్ చొరవ



మాట్లాడుతున్న నాయకులు

ఉదయగిరి: హజ్ యాత్ర ప్రారంభం నుంచి యాత్రకు వెళ్లి పూర్తిచేసుకుని వచ్చే వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవ అద్భుతమని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ అన్నారు. శుక్రవారం వీరు ఉదయగిరిలో విలేకరులతో మాట్లాడుతూ హజ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని బాధ్యతలు తీసుకోవడం సంతోషకరమన్నారు. మైనార్టీల సంక్షేమానికి గతంలో ఏ ప్రభుత్వం పాటుపడని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. హజ్ యాత్రికులకు విమాన చార్జీల భారం పడకుండా సబ్సిడీ కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల పథకం నుంచి మసీదుల ఇమామ్‌లు, మౌజాన్‌లకు జీతాల పెంపు, ఉర్దూ భాషకు అధికార హోదా కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బండగానిపల్లి మాజీ సర్పంచ్ అక్కుల్‌రెడ్డి, షఫి, నాయకులు ఉప్పుటూరి శ్రీను, ఫజుల్, వెంకటస్వామి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు



డీసీపల్లి గంగమ్మతల్లికి తిరునాళ్ల సందర్భంగా విశేష అలంకరణ

ఆత్మకూరురూరల్: మండలంలోని డీసీపల్లిలో కొలువై ఉన్న గంగమ్మతల్లి వార్షిక తిరునాళ్లలో భాగంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చింతలపల్లి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన కుంకుమ పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మర్యాదపూర్వకంగా..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విక్రమ్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): తిరుపతి జిల్లా వెంకటగిరికి శుక్రవారం ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రైతు కలెక్షన్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

దుత్తలూరు: రైతు కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్ రూములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం దుత్తలూరులోని కలెక్షన్ సెంటర్‌ను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కలెక్షన్ సెంటర్ నిర్మించుకోవడానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని, ఇందులో 75 శాతం రూ.11.25 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని, మిగిలిన రూ.3.75 లక్షలు రైతు ఉత్పత్తిదారుల సంఘం పెట్టుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లను స్టార్టింగ్, క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకుని అధిక ధర పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు, ఉదయగిరి ఉద్యానవన అధికారులు షేక్ షహీల్, జయశ్రీ, దుత్తలూరు డీఆర్‌డీఏ ఎఫ్‌సీఓ బి.కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

కొండాపురం ఎస్సైకు ఎస్పీ రివార్డులు



ఎస్పీ నుంచి రివార్డులు అందుకుంటున్న ఎస్సై

కొండాపురం: కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలికి ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి రెండు రివార్డులను శుక్రవారం అందించారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా కొండాపురంలో బహిరంగ సభ జరిగింది. ఆ సమయంలో ఇద్దరు జేబు దొంగలను పట్టుకుని బాధితులకు ఎస్సై న్యాయం చేశాడు. తూర్పు ఎర్రబల్లి, గరిమెనపెంట గ్రామాల్లో రెండు ఆలయాల్లో చోరీ చేసిన దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపించారు. తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రజలకు సేవలు అందిస్తున్న ఎస్సైను అభినందించి పురస్కారాలు ప్రదానం చేశారు. ఎస్సైను స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ న్యాయం

చేజర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నామని తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. మండలంలోని ఆదూరుపల్లికి చెందిన సంతోషమ్మకు 2010లో ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత కాలంలో సంతోషమ్మ భర్త చనిపోవడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద చేరింది. దీంతో కొందరు సంతోషమ్మకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గురువారం తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. ఈ మేరకు వాస్తవ పరిస్థితిని పరిశీలించి నివేదిక అందజేయాలని ఆర్ఐ, ఆదూరుపల్లి వీఆర్వోలను ఆదేశించారు.

ఓటరు జాబితా సవరణకు ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరురూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు బూత్ స్థాయిలో ఓటరు జాబితాలు సవరణ కోసం నెల రోజుల పాటు నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు పోలింగ్ బూతుల్లో బీఎల్‌ఓలు, బీఎల్ఏలు ఇంటింటి సర్వే చేసి కొత్త ఓటర్ల పరిశీలన, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మరణించిన, గ్రామంలో లేని వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారన్నారు. మొత్తం జాబితాలో తొలగింపులు రెండు శాతం మించకుండా, చేర్పులు 4 శాతం మించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు తాము సూచించిన ఏజెంట్‌లు ఓటరు జాబితాల సవరణలో తమ సలహాలు, సూచనలు అందించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ అధ్యక్షుడు నందా ఓబులేసు వలంటీర్ల ప్రమేయం లేకుండా ఓటరు జాబితాలు తయారు చేయాలని ఆర్డీఓను కోరారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి సుభద్ర, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆండ్రా సుబ్బారెడ్డి, టీడీపీ తరఫున తుమ్మల చంద్రారెడ్డి, పెంచలచౌదరి, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, కాంగ్రెస్ తరఫున వనం నాగరాజు, రాంకీ పాల్గొన్నారు.

రాత్రి వేళ విద్యుత్ హెల్పర్ సేవలు



ఉలవవారిపాళెంలో రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న హెల్పర్

- సచివాలయ వ్యవస్థ సత్ఫలితం

దుత్తలూరు: మండలంలోని ఉలవవారిపాళెంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో చీకట్లు అలముకున్నాయి. సచివాలయ వ్యవస్థ రాకముందు ఆ గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావాలంటే కనీసం రెండు రోజులు సమయం పట్టేది. కానీ సచివాయ వ్యవస్థ రావడంతో ఎనర్జీ అసిస్టెంట్లు, హెల్పర్ వచ్చిన తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాత్రి వేళ విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే స్థానికంగా ఉండే హెల్పర్లకు సమాచారం వెళ్లిన వెంటనే స్పందిస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగి చర్యలు చేపడుతున్నారు. గురువారం రాత్రి ఉలవవారిపాళెంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న హెల్పర్ ప్రభాకర్ వెంటనే రంగంలోకి రాత్రి పది గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇది అని స్థానికులు చర్చించుకోవడం విశేషం.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని 22 జగనన్న లేఅవుట్లలో మంజూరైన 599 పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆత్మకూరు డివిజన్ గృహ నిర్మాణ శాఖ డీఈ నటరాజ్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. 17 లేఅవుట్లలో విద్యుత్, నీటి సదుపాయం కల్పించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ప్రతి లేఅవుట్ పరిధిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శరత్, సీఎల్‌డీసీ రాధమ్మ, మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దోషులను ఉరి తీయాలి



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

అల్లూరు: మణిపూర్ హింసా కాండపై, గిరిజన మహిళను వివస్త్రను చేసి నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన వారిని వెంటనే ఉరి తీయాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జైభీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరులోని అంబేడ్కర్ బొమ్మ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటన సామాన్యుడినే కాకుండా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కూడా దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. కాబట్టి దోషులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మాన్‌రాజు, నాయకులు పంగులూరు ప్రసాద్, అనుపల్లి రాజు, సుందరం, పంగులూరు శ్రీనివాసులు, పి.సుధాకర్, మునలి నవీన్, నక్కా గిరి, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో విచారణ

చేజర్ల: చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, తహసీల్దార్ ఎల్.రామ్మోహన్‌రావు పొద్దు పోయేంత వరకు అందుకు సంబంధించి రెవెన్యూ సిబ్బందిని విచారించారు. మండలంలోని పెళ్లేరు, చేజర్ల, కాశేయపాళెం గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను ఏసీబీ అధికారులు ఇటీవల పరిశీలించి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు విచారణ గోప్యంగా నిర్వహిస్తున్నారు.